# అన్నదాతలకు అండగా ఉంటాం

- వారి సంక్షేమం కోసం ఏ త్యాగానికైనా సిద్ధం..
- దేవుళ్లపై ఒట్టు పెట్టి మరీ కాంగ్రెసోళ్లు ముంచిండ్రు
- పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం సుభిక్షం : శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఆగస్టు 22 : బుర్ర కథలు చెప్పి.. ఊర్లల్లో, పట్టణాల్లో ఎల్లమ్మగుడి, మన్యంకొండ, యాదాద్రి యాడంటే ఆడ కాంగ్రెసోళ్లు దేవుండ్లు, దేవతల మీద ఒట్లు పెట్టి మరీ నమ్మించి నట్టేట ముంచారని, అన్నదాతలకు గులాబీ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉండి సమస్యలపై పోరాడుతామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రుణమాఫీపై రైతాంగానికి బాసటగా నిలవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పాలమూరులో రైతులు, పార్టీ శ్రేణులు కదం తొక్కారు. మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో గురువారం రైతులతో కలిసి ధర్నా చేపట్టి మాజీ మంత్రి మాట్లాడారు. 42లక్షల మంది రైతులకు రూ.49వేల కోట్లు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి క్యాబినెట్‌లో రూ.31వేలు అని, బడ్జెట్ కేటాయింపుకొచ్చే సరికి రూ.7,500కోట్లు అంటూ రైతులను నిండా ముంచారన్నారు. సీఎం, మంత్రులు ఒక్కొక్కరు ఒక్కోలా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. అన్నదాతలు ఎంతో నిజాయితీ, ధర్మాత్ములని.. అటువంటివారు కాంగ్రెస్ మోసపూరిత మాటలు, వాగ్దానాలను నమ్మి 'పాలిచ్చే బర్రెను విడిచిపెట్టి దున్నపోతులాంటి ప్రభుత్వాన్ని కొట్టంలో కట్టేసుకున్నారని' ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలకు తెగించి తెచ్చుకున్న తెలంగాణ.. కేసీఆర్ పాలనలో అన్నిరంగాల్లో అద్భుత ప్రగతి సాధించిందన్నారు. ఏడాది కూడా కాకముందే ప్రజలను కాంగ్రెస్ ముప్పతిప్పలు పెడుతూ సంక్షేమ పథకాలన్నింటినీ నట్టేట ముంచిందని మండిపడ్డారు. 70–80 శాతం పూర్తయిన ప్రాజెక్టులను సైతం కాంగ్రెస్ పట్టించుకోకుండా బురదజల్లేలా విమర్శలు చేస్తుందన్నారు. కరివెన, ఉదండాపూర్ ప్రాజెక్టులు వెంటనే ప్రారంభించాలన్నారు. సాగు సమయంలో ఇవ్వాల్సిన రైతు భరోసా పంట కోతకొచ్చినా ఇచ్చే నమ్మకం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే మోసపోయామని రైతులే స్వయంగా చెబుతున్నారన్నారు. ప్రభుత్వం మెడలు వంచి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా, రుణమాఫీ అర్హులందరికీ అందించేలా కొట్లాడుతామని భరోసా ఇచ్చారు. ఇప్పటికైనా ఆలోచన చేయకపోతే రైతుబంధు, బీమా ఇలా అన్ని విధాలుగా సాగుకు దూరమయ్యే పరిస్థితులు దాపురించి వలసలు వెళ్లాల్సిన దుస్థితి వస్తుందని పేర్కొన్నారు. పేదబిడ్డల ఉన్నతికి తోడ్పాటునందించాల్సిన గురుకులాలు, వసతిగృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయని ఆరోపించారు. కాంగ్రెస్ హామీలన్నీ అమలు చేయాలని, ఇందుకు అమరణ దీక్షకైనా సిద్ధమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కేసీ నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రహెమాన్, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, నాయకులు ఉన్నారు.


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


వనపర్తి జిల్లా కేంద్రంలోని ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

# అరిగోస పెడ్తున్నరు..

- కర్షకుల చేతుల్లో కాంగ్రెస్ కనుమరుగే.. • ఒక్కో మంత్రి ఒక్కో మాట
- 9 నెలల్లోనే రోడ్డుకు లాగారు • అన్యాయం చేస్తే సహించేది లేదు
- కేసీఆర్ హయాంలో అన్నపూర్ణగా తెలంగాణ : నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : రుణమాఫీ పేరుతో రేవంత్ సర్కారు నిలువునా మోసం చేస్తూ అన్నదాతలను అరిగోస పెడుతున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఆంక్షల్లేకుండా రుణమాఫీ చేయాలని గురువారం వనపర్తిలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ధర్నాలో నిరంజన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కేవలం 9 నెలల పాలనలోనే రైతుల కంట కన్నీరు తెప్పించిన ఘనత రేవంత్‌రెడ్డి సర్కారుకు దక్కిందని, ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పరిపాలనను గాలికొదిలేసి అమలుకు సాధ్యం కాని హామీలు, అసత్య ప్రచారాలతో టైంపాస్ చేస్తున్నట్లు విమర్శించారు. రుణమాఫీపై ఆర్థిక, రెవెన్యూ, వ్యవసాయ మంత్రులు చెప్పే మాటలకు, లెక్కలకు ఎలాంటి పొంతన లేదన్నారు. రాష్ట్రంలో 70 లక్షల రైతు కుటుంబాలుండగా, కాంగ్రెసోళ్లు పావువంతు మాఫీ చేసి బ్యాంకులు, అధికారుల చుట్టూ రైతులను తిప్పతున్నారని మండిపడ్డారు. ఆగస్టు 15వ తేదీలోపే పంటరుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. వానకాలం సీజన్ చివరి దశలో ఉన్నా ఇస్తామన్న రూ.7,500 రైతుభరోసా ఇప్పటికీ రూపాయి కూడా లేదన్నారు. ఉచిత బస్సు మినహా కాంగ్రెస్ గ్యారెంటీలన్నీ బోగస్‌గా తేలిపోయాయన్నారు. తెలంగాణను అన్నపూర్ణ రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని, పదేండ్ల కాలంలో ఎండాకాలంలోనూ చెరువులు గలగల అలుగులు పారాయన్నారు. ప్రస్తుతం సముద్రంలోకి నీళ్లు వెళ్తున్నా పంట కాల్వలకు, పొలాలకు నీళ్లిచ్చే దిక్కులేకుండా పోయిందని మండిపడ్డారు. నిరుద్యోగులు, రైతులు, పాడిరైతులు, ఉద్యోగులు ఇలా అన్నిరంగాల వారు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయాల్సిన దుస్థితి కాంగ్రెస్ కల్పించిందన్నారు. ఆంక్షల్లేకుండా రుణమాఫీ అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని వదిలే ప్రసక్తే లేదన్నారు. ధర్నా అనంతరం ర్యాలీగా వెళ్లి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణాధ్యక్షుడు రమేశ్ గౌడ్, మాణిక్యం, సతీశ్‌రెడ్డి, అశోక్, రమేశ్, తిరుమల్, నాగన్న యాదవ్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, గులాం ఖాదర్, మహేశ్వర్ రెడ్డి, బీచుపల్లి యాదవ్, కొండన్న తదితరులు పాల్గొన్నారు.


అలంపూర్‌లో తాసీల్దార్‌కు బీఆర్‌ఎస్ నేతలతో కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

# దగా చేస్తే ఊరుకోం

- అర్హులందరికీ మాఫీ చేయాల్సిందే : అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, ఆగస్టు 22 : రైతులకు ఇచ్చిన హామీలో భాగంగా రూ.2లక్షల రుణమాఫీ కచ్చితంగా అర్హులందరికీ ఇవ్వాల్సిందేనని, కొందరికి ఇచ్చి మరికొందరిని విస్మరించడం కాంగ్రెస్ చేతగాని తనానికి నిదర్శనమని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గురువారం అలంపూర్‌లోని తాసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారెంటీలంటూ కాంగ్రెస్ బోగస్ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం చేతగాక కుంటి సాకులు చెబుతున్నదన్నారు. కనీసం 50శాతం రైతులకు కూడా మాఫీ కాలేదని, ఎంతో మంది అన్నదాతలు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి నిబంధనలు లేకుండా అర్హులందరికీ రుణమాఫీ చేసే వరకు కాంగ్రెస్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. అనంతరం తాసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.


దేవరకద్ర తాసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి


జడ్చర్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

## ఓటేసిన పాపానికి కష్టాలు పడుతున్నాం..

ఎలక్షన్లప్పుడు అది చేస్తాం.. ఇది చేస్తామంటూ కాంగ్రెసోళ్లు గొప్పలు చెప్పిండ్రు. అవి నమ్మి ఓటేసినం. ఓటేసిన పాపానికి కష్టాలు పడుతున్నాం. రుణమాఫీ చేసినమని గొప్పలు చెబుతున్నరు. రూ.2లక్షలలోపే రుణం తీసుకున్నా. అయినా మూడుసార్లు సారోళ్లు చెప్పిన లిస్టుల నా పేరు రాలేదన్నరు. ఎందుకు రాలేదని బ్యాంకోళ్లను అడిగితే అగ్రికల్చరోళ్లను అడగమంటరు. వాళ్లనడిగితే బ్యాంకోళ్లను అడగమని ముప్పతిప్పలు పెడ్తున్నరు. నేను రైతుననే రుణం ఇచ్చిండ్రు. ఇప్పుడు మాఫీ చేయనీకే ఎందుకు కిరికిరి పెడుతున్నరు. రేవంత్‌రెడ్డి బోగస్ మాటలు చెప్పి కాయకష్టం చేసే రైతులను మోసం చేస్తున్నడు. ఈ గవర్నమెంట్ ఇంకా నాలుగేండ్లు ఇలాగే పాలన చేస్తే ప్రజలంతా పరేషాన్ కావాల్సిందే. రైతులు నట్టేట మునగాల్సిందే.

*- రాజమ్మ, మహిళా రైతు, మక్తల్*


మాట్లాడుతున్న రాజమ్మ


# దద్దరిల్లిన ధర్నా

## ఉమ్మడి జిల్లాలో నిరసనల హోరు

- పల్లెల నుంచి కదిలొచ్చిన కర్షకులు
- ప్రభుత్వంపై భగ్గుమన్న బీఆర్‌ఎస్
- పలు చోట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం
- హాజరైన మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే విజయుడు
- రుణమాఫీలో ప్రభుత్వం విఫలమని ఆగ్రహం

*రైతులు కదంతొక్కారు.. గులాబీ శ్రేణులు నిరసనలతో హోరెత్తించారు.. నియోజకవర్గ, మండల కేంద్రాలు ధర్నాలతో దద్దరిల్లాయి.. రుణమాఫీలో రేవంత్ ప్రభుత్వం విఫలం అవ్వడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునివ్వగా.. గురువారం ఉమ్మడి జిల్లాలో రైతులతో కలిసి నాయకులు కదంతొక్కారు. చౌరస్తాలు, రోడ్లపైకి చేరుకొని సర్కారుకు వ్యతిరేకంగా నినదించారు. పలు చోట్ల రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వనపర్తి, మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తోపాటు అలంపూర్‌లో ఎమ్మెల్యే విజయుడు, దేవరకద్రలో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణపేటలో రాజేందర్‌రెడ్డి, మక్తల్‌లో చిట్టెం, కొల్లాపూర్‌లో బీరం హర్షవర్ధన్‌రెడ్డి, కల్వకుర్తిలో జైపాల్ యాదవ్, వంగూరులో గువ్వల బాలరాజు, జడ్చర్లలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజినీ సాయిచంద్, గద్వాలలో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. షరతుల్లేకుండా అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నాడు పంట రుణాలు తెచ్చుకోండి.. మాఫీ చేస్తామని ప్రకటనలు గుప్పించి.. నేడు అధికారంలోకి వచ్చాక కొర్రీలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. 9 నెలల్లోనే రైతులను రోడ్డెక్కించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల నుంచి భంగపాటు తప్పదని హెచ్చరించారు. మాఫీపై ఆర్థిక, రెవెన్యూ, వ్యవసాయ మంత్రులు చెప్పే మాటల లెక్కలకు ఎలాంటి పొంతన లేదన్నారు. రాష్ట్రంలో 70 లక్షల రైతు కుటుంబాలుంటే.. కొద్ది మందికి మాత్రమే చేసి గారడీ చేసిందన్నారు. ఇప్పటికైనా మీనమేషాలు లెక్కించకుండా అర్హులందరికీ ఆంక్షలు లేకుండా మాఫీ చేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.*

*- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, ఆగస్టు 22*





నారాయణపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వంగూరు డీటీ వెంకటరమణకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

కల్వకుర్తి రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి


మక్తల్‌లో హైవేపై రైతులతో కలిసి ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి


అయిజలో ప్రవహిస్తున్న గంగమ్మ చెరువు వాగు


# దంచికొట్టిన వాన

- రాకపోకలకు అంతరాయం
- లోతట్టు కాలనీలు జలమయం

అయిజ, ఆగస్టు 22 : అయిజ మున్సిపాలిటీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పోలోని వాగుకు భారీగా వరద వచ్చి చేరుతున్నది. అయిజ మున్సిపాలిటీలోని లోతట్టు కాలనీల్లోకి వర్షపు నీరు చేరింది. అయిజ నుంచి పులికల్, ఉత్తనూర్ తదితర గ్రామాలకు వెళ్లే రహదారుల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మడ్డిగుంత కాలనీ, గాజులపేట, భరత్‌నగర్, దుర్గానగర్ తదితర కాలనీలు జలమయమయ్యాయి. అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

**కొట్టుకుపోయిన వంతెన**

ధరూర్, ఆగస్టు 22 : ధరూర్ మండలంలోని నీలహళ్లిలో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో వరద ఉధృతికి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోవడంతో జనజీవనం స్తంభించింది. గ్రామంలోని వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గద్వాల–రాయిచూర్ వెళ్లాల్సిన ప్రయాణికులు రెండు కిలోమీటర్ల దూరంలోని పాతపాలెం వెళ్లి తమ గమ్యస్థానాలను చేరుకుంటున్నారు. విద్యార్థులు కూడా ఇలాగే వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. బ్రిడ్జి నిర్మాణాన్ని అధికారులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు కోరారు.


నీలహళ్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


మహిళా రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

# మాఫీ చేస్తలేరు సారూ..

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో మహిళలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఆగస్టు 22 : రుణమాఫీ కోసం మహిళా రైతులు పోల్కంపల్లి అంజిలమ్మ, దాసర్‌పల్లి వెంకటమ్మ గురువారం మహబూబ్‌నగర్‌లోని న్యూటౌన్ యూనియన్ బ్యాంక్‌కు వచ్చారు. మాఫీ గురించి అడిగితే అధికారులెవరూ స్పందించకపోవడంతో బ్యాంక్ వద్ద దిగాలుగా కూర్చున్నారు. అటుగా వెళ్తూ గమనించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వారిని పలుకరించగా, వారు కన్నీటి పర్యంతమయ్యారు. కష్టాన్ని నమ్ముకొని బతికేటోళ్లం బిడ్డా.. రుణమాఫీ అంటూ ఆశపెట్టి మాకు కాకుండా చేసిండ్రు అంటూ వాపోయారు. పింఛన్ కూడా ఇస్తలేరంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మాజీ మంత్రి వారిని ఓదార్చి బ్యాంక్ అధికారులతో మాట్లాడారు. వారి సమస్య ఏంటో తెలుసుకొని పరిష్కరించాలని కోరారు.

## మాకెందుకీ శిక్ష..



నాపేరున 1.35 ఎకరాల భూమి ఉంది. బ్యాంక్‌లో రూ.30వేలు రుణం కట్టాల్సి ఉంది. ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకంలోనూ నా పేరు సరిగానే ఉంది. బ్యాంక్ బుక్కులో మా నాయిన యాదయ్య పేరు తప్పుగా ఉందని, అందుకే రుణమాఫీ కాలేదని చెబుతున్నారు. తప్పువారిదైతే శిక్ష మాకెందుకు. రుణం ఇచ్చేటప్పుడే ఈ తప్పుల గురించి చెప్పేదుండే. కొర్రీలు లేకుండా రుణమాఫీ చేయాలి.

*- కర్రె రాములు, మునిమోక్షం, హన్వాడ మండలం*

## సగం మందికే..



హన్వాడ కో ఆపరేటివ్ సొసైటీలో 401 మంది రైతులకు రూ.2.45కోట్లు రుణమాఫీ చేస్తామని చెప్పారు. కానీ అధికారులు కేవలం 220 మందికి రూ.1.10కోట్లు మాత్రమే మాఫీ చేస్తామని చెబుతున్నారు. ఇదెక్కడి న్యాయం. అందరికీ సమన్యాయం చేయాలి. అర్హులకు కూడా మాఫీ చేయకుంటే ఎట్లా.

*- కరుణాకర్‌గౌడ్, బుద్ధారం, హన్వాడ మండలం*